# ఏడుపుగొట్టు కథలపోటీలో మూడవ బహుమతి పొందిన కథ

ఏడుస్తూ నిద్రలేచాడు మా ఏడవ కాన్పులో పుట్టిన ఒకే ఒక (ఏ)కైక పుత్రుడు ఏడవ వాడగు ఏడు కొండలు. నేను చాలా ఆశ్చర్యపోయాను. ఎందుకంటే మా ఏడుకొండలు మధ్యాహ్నము సర్వసాధారణంగా నిద్రపోడు, నిద్రపోయాడంటే ఆ మరునాడు ఉదయం వరకు నిద్రలేవడు. అందుచేత వాడిని మధ్యాహ్నము పడుకోనియ్యము. ఒకవేళ ఖర్మకాలి పడుకున్నాడా వాడ్ని రాత్రి భోజనానికి లేపడానికి నేను వాడి ఆరుగురి అక్కలు వాడి చుట్టూ చేరి పెద్దగా ఏడుస్తాము. అప్పుడువాడు మా ఏడుపంతా సుప్రభాతంలా విని నిద్రనుండి లేస్తాడన్నమాట. అది లేకుండా తనంతట తానే నిద్ర నుండి లేచిపోయాడంటే ఆశ్చర్యపోవడంలో తప్పులేదు.

ఏంటిరా సంగతి అని ఆశ్చర్యము నుండి తేరుకోకుండానే అడిగేశాను.

"మరేమో, మరేమో నా కలలో "ఆంధ్రభూమి" కనిపించింది" వా... మళ్ళీ ఏడుపు మొదలెట్టాడు.

అమ్మో! ఆంధ్రభూమే! అని గట్టిగా అరిచేసాను. ఆంధ్రభూమి పేరువినగానే నా కోపం వాడి ఏడుపు తో కలిగిన చిరాకు, ఆశ్చర్యము అన్ని మటు మాయమయ్యాయి. ఆంధ్రభూమి పేరు వినగానే ఆరుగురు అమ్మాయిలు బిల, బిల మంటూ వచ్చి మా చుట్టూ చేరారు. వచ్చినవాళ్ళు వచ్చినట్లు ఉన్నారా "ఆంధ్రభూమి" అంటున్నావు ఏంటే అమ్మా అని ఒక్కుమ్మడిగా అన్నారు. తమ్ముడికి ఆంధ్రభూమి కలలో కనిపించిందట అని అన్నాను.

వెంటనే పెద్దమ్మాయి "ఓరెయి! తమ్ముడు ఆంధ్రభూమి ముఖచిత్రం ఏవరిదిరా" అని ఏడుకొండల్ని తనవైపు లాక్కుంది. అలాగుడుకు ఏడు కొండలు తూరిపడిపోయి ఆరున్నొక్క శృతిలో ఒకరాగం అందుకొన్నాడు.

రెండవ అమ్మాయి "ఆంధ్రభూమి ఏ వారందిరా" అని తన వైపు లాక్కుంది. అదే శృతిలో ఇంకొక రాగం ఎత్తాడు.

ఓరేయి! పోనీ కల్లో కనిపించిన భూమిలోనైనా సరే అ.చె.గారు ఆడో, మగో చెప్పారా అని మూడో అమ్మాయి

## ఏడుపు (గొట్టు) ఏడుకొండలు




(ఈ పత్రికలో గాని మీరు ఆడోమగో చెప్పకపోయారంటే మీడొక్క చించి డోలుకడతాను అని అ.చెగార్కి ఉత్తరం వ్రాసిందిలెండి అందుకని ఆ ప్రశ్న అడిగింది.)

ఓరేయి! మల్లాది గారి ఫోటో చూసావా అని నాల్గవది తనవైపు లాక్కుంది. మీ ముఖం చూడకుండ నేను బ్రతుకలేను అని మల్లాదికి ఏడు వ ందల డబ్బది ఏడు సార్లు ఉత్తరాలు రాసింది.

తమ్ముడు "ది రైటర్" రచయిత ఎవరో అందులో రాసుందా? అని ఐదవ అక్క తనవైపు లాక్కుంది. మన హీరో రాగం అలాగే ఆరున్నొక్క శృతిలోనే ఆలపిస్తూనే ఉన్నాడు.

ఇంతలో ఆరవ అక్క కళ్లను తడుముకుంది. మూడు వారాల నుండి పత్రిక కోసం ఎదురుచూసి, ఎదురుచూసి కళ్ళు కాయలు కాసాయి. అందుకని ఆకాయలని మరొక్కసారి తడుముకొని ఓరెయి! మూడు వారాలకి కలిపి ఒక్క "భూమే" వచ్చిందా; నువ్వుదానిమీద తారీఖు సరిగ్గా చూసావా? అని ఏడుకొండల్ని తనమీదకు లాక్కుంది.

ఏడు కొండలు అమ్మ ఆ పిల్లాడిని (అంటే ఏడురెళ్ళు పద్నాల్గేళ్ళ వయసున్న) తన ఒళ్ళోకి లాక్కొని ఒరేయ్ ఏడు అందులోని వనితావనిలో నేను వ్రాసిన "అమ్మలక్కలు, లక్కపిడతలు" వ్యాసం పడిందిరా! అని బుజ్జగిస్తూ అడిగింది. అందరి ప్రశ్నలకు వాడి సమాధానం "వా... లేద్దు".

చిట్ట చివర్న వాళ్ళ నాన్న ఆఫీసు నుండి ఇంటికి వస్తున్నారు. అల్లంత దూరం నుంచి ఇంట్లోంచి ఏడుపులు వినిపిస్తున్నాయి. ఆ! వీడు మధ్యాహ్నం పడుకొని ఉంటాడు. వాణ్ణి లేపడానికి వీళ్ళ ఏడుపులు కాబోలనుకున్నారు. తీరా ఇంటిదగ్గరకు వచ్చినప్పటికి ఆ ఏడుపుల్లో అందరినోట "ఆంధ్రభూమి, ఆంధ్రభూమి" అని మాత్రమే వినిపిస్తున్నాయి. అరే! ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక ఆపేశారా! అని ఒకటే కంగారుపడిపోయి ఏమైంది ఆంధ్రభూమికి అని గబగబా అడిగేసాడు. పెద్దమ్మాయి ఏడుపు ఆపి "తమ్ముడికి ఆంధ్రభూమి కలలో కనిపించిందట" వా....

ఆ! కనిపించిందా? ఓరెయి, ఓరెయి, ఏడు అంటూ వాళ్ళ అమ్మ ఒళ్ళో ఉన్న ఏడుకొండల్ని గబాల్న తన ఒళ్ళోకి లాక్కుని, "నే వ్రాసిన ఏడుస్తూ ఏడవ కాన్పు" భావచిత్రాలు ఈ భూమిలో నైనా పడ్డాదిరా అని సంతోషంగా అడిగారు. "వా... లేదు."

"మరేం చూసావు దొంగసన్యాసి కల్లో ఆంధ్రభూమి చూసిన వాడివి లోపల పేజీలు చూళ్ళేదా?"

"చూసానే, నాకు చెప్పనివ్వరు కదా ఏం చూసానో మీ ప్రశ్నలతోటే నన్నేడిపిస్తున్నారు. మీరు ఏడుస్తున్నారు."

అందరూ ముందుకి వంగి "అయితే ఏం చూసావు" అని ఒకేసారి అడిగారు.

ఆంధ్రభూమి అట్టమీది బొమ్మనాది వేశారు. ఆ పుస్తకం నిండా నేను వ్రాసిన అ, ఆలు, ఇ.ఈలే ఉన్నాయి. సెంటర్ స్ప్రెడ్‌లో ఇలా ఉంది "ఏడుపుల ఏడుకొండలు ఏడవ సారి కూడ ఫెయిలు" అని వా... అని మళ్ళీ ఏడుపు అందుకున్నాడు. వాడితోపాటు అమ్మా, నాన్న, అక్కలూ అందరూ వా...

—కె.భారతి

*